ఉండదు. శెలవులివ్వటం మనం అప్రయత్నంగా అన్యాయం చెయ్యటం జరుగుతుంది. అందుకని శెలవులవిషయం కొన్ని నిబంధన లేర్పరచాలి. అది మనం సాధ్యమైనంత త్వరలో చేస్తే మంచిది."

"అట్లాగే చేయించండి!"

సుబ్రహ్మణ్యం లూసీని పిలిచి రెండు సర్క్యులర్లు — ఒకటి జీతాలహెచ్చింపుకు సంబంధించినదీ, ఇంకోటి శెలవుల నిబంధనలకు సంబంధించినదీ — చెప్పి, వాటిని టైపుచేసి, అందరికీ చూపించమని చెప్పాడు. తనకూ, మేనేజరుకూ, ఎకౌంటెంటుకూ, ఫైలుకూ కాపీలు తియ్యమన్నాడు.

అయిదుగంటలు కాగానే అతను వెళ్లిపోయినాడు. అతను వెళ్లిన మరుక్షణం ఆఫీసులో వ్యాఖ్యానాలు బయల్దేరినై. ఇతను రావటంవల్ల ఆఫీసూ, వ్యాపారమూ బాగుపడే లక్షణా లున్నయ్యని ఒక రన్నాడు. ఈనగారు ఇంగ్లండులో నేర్చుకొచ్చిన శాస్త్రమంతా ఇక్కడే వెళ్లబెడుతున్నా డన్నాడు మరోఆయన. కొత్తబిచ్చం ఇట్లాగే ఉంటుందని మరొ కడన్నాడు. అందరికీ జీతాలు పెంచి కొండల్రావుజీతం పెంచకపోవటం అన్యాయమని ఒక రన్నారు. (కొండల్రావు మేనేజరుమనిషని తెలిసి, అతనంటే భయపడుతూ అతని మంచికోసం దేబిరించే భ్రష్టు లాఫీసులో ఉన్నారు.) నిన్న సుబ్రహ్మణ్యాన్ని కొంతదూరం సాగనంపి అంత మంచిగా మాట్లాడిన పనీ పాటా లేని ముసలాయన "ఏమో నాయనా! ఇన్నాళ్లనించీ ఈ ఆఫీ సీనోటీసులూ ఏవీ లేకుండానే వెళ్లింది. ఇప్పు డివన్నీ కలిగినై. ఇదో కొత్త!" అని అన్నిరకాల అభిప్రాయాలతోనూ ఏకీభవిస్తూ అన్నాడు.

కొండల్రావుమాత్రం నోరు విప్పలేదు. కొత్త యజమాన్ని గురించి అతను అనగోరిన దంతా అందరికీ అర్థమయ్యేట్టు కళ్లతోనే అని, సర్వభద్రంగారి గదికి వెళ్లాడు.

"నీ కేం ఫరవాలేదు, కొండల్రావ్. అందరితో పాటు నీకూ పది పెంచితే చాల దన్నాను. ఆలోచిస్తే నన్నాడు. ముష్టి పదిరూపాయల పెంపకమైతే ఇవాళే నీపేరు లిస్టులో చేర్చలేకపోయినానా?" అన్నాడు సర్వభద్రంగారు, పెద్ద బొంకు బొంకి.

కొండల్రావుఆగ్రహం ఉపశమించింది. అతను మేనేజరుగారిదగ్గిర శెలవు పుచ్చుకుని ఇంటికి వెళ్లాడు.

సర్వభద్రంగారు ఈ కొత్త సమస్యనుగురించి తీవ్రంగా ఆలోచించాడు. ఈ ధూమశకటానికి పాతకాగితాలు చూసే తీర్మానం ఉంటే తను జాగ్రత్తపడాలి సిందే. ఇతనితో ఏవైఖరి అవలంబించాలో ఆయన కింకా తెలియలేదు. తనమీద అతని కేమాత్రం గురీ, గౌరవమూ ఉందీ తేల్చుకుంటేగాని కర్తవ్యం నిర్ణయం కాదు.

ఇవాళ అతను చేసిన మార్పులు నిజానికి సర్వభద్రంగారి నంటేవికావు. అత నిటువంటి మార్పు లెన్ని చేసినా తన కేమీ ఫరవాలేదు. కాని కేవలమూ రోగ లక్షణం అనుకుని చూస్తే ఈమార్పులు తనకు శుభకరంగా కనిపించలేదు. ఇటువంటి పనులు చేసే తీర్మానమే ఉంటే ఈధూమశకటం రేపు తనకిందికి నీళ్లు తేకుండా ఉంటాడా? అదే తేలలేదు సర్వభద్రంగారికి.

"కానీ, చూతాం! అప్పుడే ఏమయింది? ఈ ధూమశకటంజబ్బు ముదురుతుందని తోచినప్పుడే బ్రహ్మాస్త్రం ప్రయోగించవచ్చు" అనుకున్నా డాయన.

౨

సుబ్రహ్మణ్యంమనస్తత్వం అంచనాకట్టటంలో సర్వభద్రంగా రేమాత్రమూ పొరపడ్లేదు. ఆనాడు తను ఆఫీసులో చేసిన మార్పులు తలుచుకున్నప్పుడల్లా అతని రొమ్ము పొంగింది. ఇంతకంటె, తను కాదు, బ్రహ్మదేముడుమటుకు కేం చెయ్యగలడు? రెండు రోజులైపోయినై. తను చెయ్యగలిగిందీ అయిపోయింది. మిగతా ఇరవైయెనిమిదిరోజులూ ఏదోవిధంగా ముక్కు మూసుకుంటే ఆపైన ధూమశకటం వచ్చి తన యిష్టం వచ్చినట్టు చేసుకోనీ. ఇక తన కర్తవ్యమల్లా రోజూ ఆఫీసుకు పోవటమూ, జరిగే పని తణిఖీచేస్తున్నట్టు నటించటమూ, ఏవన్నా పుస్తకాలు తెచ్చి చదువు

